


# నిప్పులేని పొగ

## ఎం.ఎం. అయోధ్యారెడ్డి

"నువ్వా అమ్మాయిని చూడ్డానికి వీల్లేదు" అన్నాడు రాయుడు. నమలుతున్న చూయింగ్ గమ్‌ని కుడివైపు పళ్ళకింద నుండి ఎడంవైపు పళ్ళకిందకు మార్చుకుంటూ.

కుతూహలంగా చూశాడు సారథి స్నేహితుని కేసి.

"అవున్రా, సారథీ! నువ్ ఆ అమ్మాయిని చూడడం నా కిష్టం లేదు—నే ఒప్పుకోను—"

"అదేం...? ఎందుకనిరా?"

"ఎందుకనంటే ఏం చెప్పను...? కారణాలు చాలా ఉన్నాయి."

"అదేనోయ్—ఏమిటా కారణాలని అడుగుతున్నా...!"

"ఆమె నీకు తగదురా. సారథీ! నా మాట విను—" అప్పటికీ కారణాలు చెప్పకుండా ఒక్క మాటలో అన్నాడు రాయుడు.

సారథికి విసుగొచ్చింది —"డామిట్! కారణాలు చెప్పమంటుంటే... ఎంతసేపూ ఆమె నాకు తగదు అని తప్ప మరోమాట చెప్పలేం? ఏరా...! మాలతి అందంగా లేదా..?"

రాయుడు అదోలా నవ్వాడు. కుర్చీలోంచి నెమ్మదిగా లేచి, కిటికీ దగ్గరగా వెళ్ళాడు. అక్కడ నిలబడి కిటికీ చువ్వలగుండా దృష్టిని బయటకు పారిస్తూ, జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు.

ఒక సిగరెట్ సారథికి ఆఫర్ చెయ్యబోతూ మధ్యలోనే ఆగాడు. అతను స్మోక్ చెయ్యడని గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకొని తనే అంటించుకొన్నాడు.

సుదీర్ఘంగా ఒక దమ్ము లాగి పొగను రింగు రింగులుగా సీలింగ్ కేసి వదిలాడు.

"చూడు, సారథీ!" సిగరెట్‌ని ఎడం చేతి రెండు వేళ్ళ మధ్యా సుతారంగా పట్టుకొంటూ అన్నాడు.

"మాలతి అందంగా లేదని కళ్ళున్న వాడెవడూ అనలేడు. ఆ అమ్మాయి సూపర్ బ్యూటీయే కాదన్ను. కాని, కేరెక్టర్ అనేదుంది చూశావ్... అది అందం కన్నా విలువైందిరా. అది లేక పోయినాక ఎంత అందముంటే ఏం లాభం...?"

సారథి మొహం వివర్ణమైందీ మాటతో—

"అంటే — ఏమిట్రా నీ ఉద్దేశం...?" అని ప్రశ్నించాడు.

"అవున్రా! మాలతి అందమైనదే. గ్రాడ్యుయేట్ కూడా. అలాంటి అమ్మాయిలు అరుదుగా ఉంటారు. ఈ విషయంలో సందేహం ఏమీ లేదు. కాని..."

రాయుడు మిగతా మాట పూర్తి చేయలేక సిగరెట్ నోట్లో పెట్టుకున్నాడు.

సారథి తీక్షణంగా చూశాడు స్నేహితుని కేసి.

అతన్లో ఓపిక అనేది పూర్తిగా చచ్చిపోయిందన్న యథార్థం అతని మొహం చూస్తేనే తెలిసిపోతుంది.

"రాయుడూ! అసలు విషయమేమిటో చెప్పరా ప్లీజ్!" — అన్నాడు లేని ఓపికనంతా కూడ గట్టుకొని.

"చూడు. సారథీ! నువు నమ్మినా... నమ్మకపో... కాని నేను చెప్పేది మాత్రం నిజం. నువ్ రేపు పెళ్ళి చూపులు చూడబోయే ఆ మాలతి చెడిపోయింది. నా స్నేహితుడు ఒక చెడిపోయిన పిల్లని పెళ్ళి చేసుకోబోతుంటే — చూస్తూ మౌనంగా ఉండలేక చెప్పాను. ఆ పైన ఆలోచించుకో..!"

"మాలతి చెడిపోయిందా...? అంటే... ఏ విధంగా...?"

"ఏ విధంగా చెడిపోయిందో కూడా కావాల్ట్రా నీకు...? అది నేను చెప్పటం కన్నా ఆ ఊళ్ళోకి వెళ్ళి ఎవర్నయినా కదిపి చూడు— చెబుతారు డిటైల్డ్‌గా.."

సారథి నీరసపడి పోయాడీ మాటతో. అంతక్రితం రాయుడు చూసి టేబుల్ మీద పడేసిన కార్డు సైజు ఫోటో చేతిలోకి తీసుకొని మరోమారు అందులోకి చూశాడు.

మాలతి ఫోటో అది — రేపు తను పెళ్ళి చూపుల్లో చూడబోయేది ఆ అమ్మాయినే.

నిజంగానే కళ్ళు చెదరగొట్టే అందం మాలతిది. అందమైన కోల మొహం, నవ్వుతున్నట్లున్న ఎర్రని పెదాలు. అమాయకత్వాన్ని చాటుతూ విశాలమైన కళ్ళు. ఆమె ముఖానికి కొత్త అందాలను సంతరించి పెడుతున్నాయి. ఏ పౌడరూ ఎరగం అన్నట్లుగా నునుపుగా ఉన్న బుగ్గలు...!

రెండు జడలు వేసుకొంది ఫోటోలో. మెడలో లాకెట్‌తో సన్నటి బంగారపు గొలుసు.

మాలతి...! నిజంగా ఏంజిల్!!!

చదువుతూ, అనవసరంగా పోజ్ పెడుతున్న ఆ అమ్మాయి కేసి అలా చూస్తూండి పోయాడు సారధి.

'ఈ అమ్మాయి నిజంగానే చెడిపోయిందా? రాయుడు చెబుతూంది నిజమేనా? లేక ఏదైనా ఈర్ష్య లాంటిది మనసులో ప్రవేశించి అతి అలా చెబుతున్నాడా...??

కాని రాయుడి కెందుకు ఈర్ష్య...? తను వాడికి ప్రాణమిత్రుడు — అందుకు తోడు ఈర్ష్య కల్గడానికి రాయుడు ఒంటి వాడేం కాదు — పెళ్ళి అయ్యింది. మరో కొద్ది రోజుల్లో తండ్రి కూడా కాబోతున్నాడు —

ఫోటోలోంచి ఎంత చూసినా సారధి చూపుల్ని మరల్చుకోలేకపోతున్నాడు —

"రాయుడూ మాలతి నిజంగానే చెడిపోయిందంటావా?" అని అడిగాడు గొంతు భారంగా ధ్వనిస్తుంటే.

సిగరెట్టు కాలుస్తూ గదిలో పచార్లు చేస్తున్న వాడల్లా ఆగి సారధికేసి తీక్షణంగా చూశాడు రాయుడు.

"డియర్ సారధీ! వాడి ఈ వూరే నన్న విషయం ఒప్పుకుంటావా నువ్వు...?" అని ప్రశ్నించాడు సీరియస్‌గా.

"అదేం ప్రశ్నరా...?"

"కాకపోతే మరేమిటి? ఈ వూళ్ళో ఉండే వాళ్ళు. ఇక్కడ ఎవరు ఎలాంటి వాళ్ళన్న విషయం నాకు తెలుసా... నీకు తెలుసా? మాలతిని గూర్చి నేనే చెప్పటమెందుకు? వూళ్ళో ఎవర్నడిగినా చెప్తారు. ఒక్కసారి బయటకు వెళ్ళిరా — ఆమె మీద ఎన్నెన్ని ప్రచారాలున్నాయో, ఇదివరలో పెళ్ళి దాకా వచ్చిన సంబంధాలు ఎన్ని తప్పిపోయాయో... స్టాటిస్టికల్‌గా వివరిస్తారు నీకు..."

చాలాసేపు జవాబు చెప్పకుండా మౌనంగా ఉండిపోయాడు సారధి. అతనికి చెప్పలేనంతగా నిరాశ కలగ సాగింది. ఏదో అపూర్వమైన వస్తువు చేయి జార్చుకుంటున్నట్లుగా బాధగా ఉంది కూడా.

చాలా సేపటికి గొంతు పెగుల్చుకుని అన్నాడతడు. —

"ఆ అమ్మాయి పైన జరిగిన ప్రచారాలు కేవలం ప్రచారాలేమో! మాలతి మొహం చూస్తే అలాంటి దానిలా అగుపించదు. పెళ్ళి కాని ఒక అమ్మాయి మీద నిజానిజాలు తెలియకుండానే... అట్లాంటి అభిప్రాయానికి రావడం..."

"బావుండదూ.. అంటావు అంతేనా నువ్వు చెప్పేది? ఆ అమ్మాయి అభం శుభం తెలీనిదని కదూ నువ్ చెప్పేది...??"

"అవును, మనం చాలా చోట్ల ఎన్నో విషయాల్లో చూస్తుంటాం. అపవాదులంటూ ఉన్న చోట నిజం మాత్రం మరోలా ఉంటుంది—"

రాయుడు మండిపడి పోయాడు మాటకు —

"ఒరేయ్! నువ్వట్లాంటి కోల్డ్ కూతలు కూయకు. అలా అయితే నిప్పు లేందే పొగ రాదన్న కోల్డ్ సూక్తి చెప్పాల్సి వస్తుంది నేను"

సారధి మళ్ళీ మౌనంగా ఉండిపోయాడు.

గదిలో పచార్లు చేయటం మాని, రాయుడు సారధికి ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"చూడు, సారధీ!" చెప్పటం మొదలెట్టాడు— "నీకేం తక్కువైంది. చెప్పు? మంచి ఉద్యోగం చేస్తున్నావ్ సొసైటీలో మంచి స్థానంలో ఉన్నావు కావాలంటే నీ కోసం ఎంతో మంది అమ్మాయిలు క్యూలో నుంచుంటారు. అలాంటి పొజిషన్లో ఉన్న నీ కిట్లాంటి డర్టీ బిచ్‌ను ఉద్ధరించాల్సిన ఖర్మేం పట్టింది చెప్పు...?"

"కానీ ఈ అమ్మాయి మంచిదనీ, చదువు కొందనీ, వాళ్ళ కుటుంబం కూడా ఎంతో మంచిదనీ..."

"చెప్పారా 'కిట్లా? ఎవరది?"

"అదే! ఆ మీడియేటర్ ఆయన పేరేమిటో తెలీదు నాకు —" పెళ్ళున నవ్వాడు రాయుడి మాటకి.

"మధ్యవర్తుల మాటలు నమ్మితే ఇంతే సంగతి వారేయ్! మాలతి గూర్చి నాకు తెల్సినట్టుగా మరెవ్వరికీ తెలీదు. ఆమె నా కాలేజీ మేట్. ఆవిడకీ వూళ్ళో ఎవరెవరితో పరిచయాలున్నాయో...మరెవరితో సంబంధాలున్నాయో... నాకు బాగా తెలుసు. ఆ లిస్టంతా నా దగ్గరుంది. చెప్పమంటావా? వద్దులే? విని భరించలేవు నువ్వు.... ఇలాంటి అమ్మాయి నామెను చూడ్డాని కొచ్చానని పశ్చాత్తాప పడిపోతావు—"

చెప్పటం ఆపి సారధి కేసి చూశాడు రాయుడు. అతడు వింటున్నాడు. మొహంలో డిసప్పాయింట్మెంట్ స్పష్టంగా అగుపడుతోంది. అతని భుజం తట్టాడు చిన్నగా.

"డోంట్ వర్రీ ఫ్రెండ్! ఇందులో పోయిందేమీ లేదు. ఈ అమ్మాయి కాకపోతే మరొకరు."

"అది కాదురా నేనాలోచించేది."

"మరేమిటోయ్"

"మాలతి కుటుంబం గూర్చి ఆలోచిస్తున్నాను ఆమె కింకా ఇద్దరు చెల్లెళ్ళు కూడా ఉన్నట్టు తెలిసింది. వారి గతేమిటా అని? అక్క కేరెక్టర్ గురించే ఇలాంటి పబ్లిసిటీ ఉంటే... పాపం ఆ వాళ్ళనెవరు చేసుకుంటారు..?"

"అవును! చేసుకోరు." రాయుడు ఒప్పాడు.

"అందుకేరా మనం కొంత సానుభూతిగా ప్రవర్తించాలి. ఇందులో నిజానిజాలేమిటో తెలుసుకొని..."

'కమ్మాన్! సారధీ'— అన్నాడు రాయుడు. అతనికి బాగా కోపమొచ్చేసింది.

"ఏవేవో పిచ్చి పిచ్చి ఆశయాలు వల్లించకురా! అవంటే ఎలర్జీ నాకు. ఇదేం కథనో, సినిమానో కాదు. జీవితం. ఇప్పుడు మాలతి కుటుంబానికొచ్చిన లోటేమీ లేదు. వాళ్ళ అవసరాలు తీర్చడానికి, ఆవిడ అందం చుట్టూ తుమ్మెదల్లా తిరుగుతున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు. అక్క సంపాదన చాలకపోతే చెల్లెళ్ళు కూడా అదే దారి తొక్కుతారు. ఇందులో [illegible]చుకు పోయిందేమీ లేదు—" అన్నాడు ఆవేశంగా.

అతని మొహంలోకి చూస్తూ చిన్నగా నవ్వాడు సారధి — "అంత కోపమెందుకోయ్?" అన్నాడు.


"కాకపోతే ఏమిట్రా! నీకా మాలతి ఫోటో చూశాక మతి పోయిందల్లే ఉంది —"

రాయుడు లేచి తిరిగి పచార్లు మొదలెట్టాడు. అతని గొంతు సీరియస్‌గా పలికింది.

"సారధి! నన్ను నువ్వే విధంగా అర్థం చేసుకున్నా ఫరవాలేదు. కానీ, నీకు మరో నిజం చెబుతున్నాను విను — ఆ మాలతి కున్న ప్రియుళ్ళలో నేనూ ఒకణ్ణి. డబ్బు రూపేణా.. వస్తువు రూపేణా... ఆవిడకు సాయం చేస్తూ, ఆవిడ అందాన్ని కొనుక్కున్న వాళ్ళలో నేను కూడా ఉన్నాను. నన్ను అసహ్యించుకున్నా సరే — కాని రియల్ ఫాక్ట్ మాత్రం ఇది —"

సారధికి తాను కూర్చున్న పడక కుర్చీ అకస్మాత్తుగా ఇరుకైపోయి, తానందులో ఇరుక్కుపోతున్నట్లుగా అయింది పరిస్థితి. ఏదో వూపిరాడని గదిలో బంధించబడినట్టుగా కూడా అయింది. నిస్తేజంగా కూర్చుండిపోయాడు. చాలాసేపు.






అంతవరకూ చేతిలోనే అపురూపంగా పట్టుకొన్న మాలతి ఫోటో, ఇప్పు డిక మోయలేనంతగా బరు వన్పించసాగింది. దాన్ని పక్కన టేబిల్ పైకి విసిరేసి. చటుక్కున లేచాడు.

"సరే! మరింక నేను వెళతారా ...!"

"వెళతావా? ఎక్కడికి?"

"ఇంకెక్కడికి! మా వూరికి. ఇప్పుడు బస్సుంది."

"అంటే ... అమ్మాయిని చూసే ఉద్దేశం మార్చుకున్నట్టేనా?" కొంచెం రిలీఫ్‌గా చూస్తూ ప్రశ్నించాడు రాయుడు.

భారంగా నిట్టూర్చాడు సారథి.

"అవున్రా! మార్చుకున్నట్టే. మాలతిని గురించి ఇంకా తెలుసుకోవలసింది ఏమీ లేదు. ఈ సంగతి ముందుగానే నాకు తెలియజేసినందుకు థాంక్స్‌రా. ఇక వెళతాను. రేపటివరకూ ఉంటే మళ్ళీ వాళ్ళు వచ్చేస్తారు. అన్ని విధాలా ఇబ్బంది" అంటూ తన గది కేసి వెళ్ళబోతున్న స్నేహితుడ్ని ఆపాడు రాయుడు.

"అలా వీల్లేదురా! చాలా రోజుల తర్వాత కలుసు కొన్నాం. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో తెలియదు. ఈ రాత్రికి ఉండిపోరా. మళ్ళీ ఉదయమే వాళ్ళెవరూ రాకముందే వెళ్ళిపోదువుగానీ ... ఏం?"

క్షణంసేపు యోచించి అంగీకార సూచకంగా తలూపాడు సారథి.

"సరేరా, రాయుడూ! అలా బయటి కెళ్ళొస్తా. నో వారు. వోపికుంటే సెకండ్ షో కూడా చూస్తాను. ఏం? నా గురించి చూడకు. నువ్ పడుకో."

"అలాగే! గుడ్‌నైట్! షోనుంచి రాగానే బెల్ నొక్కు. నౌకరు తలుపు తీస్తాడు" అంటూ లోపలకు పోయాడు రాయుడు.

తనూ బయటకు నడిచాడు సారథి.

* * * *

గోడనానుకుని నిలబడి, రెండు అరచేతుల్లో మొహం దించుకొని వెక్కివెక్కి ఏడుస్తూంది మాలతి.

ఆమె ఏడుపు దయనీయంగా ఉంది. వెక్కిళ్ళతో ఆమె గుండె ఎగిసి పడుతూంది. ఎదురుగా ఈజీచైర్లో విలాసంగా కాలుమీద కాలు వేసుకుని కూర్చొని, సిగరెట్ కాలుస్తున్నాడు రాయుడు.

"చూడు మాలతీ! అలా అనవసరంగా ఏడ్చి, కన్నీళ్ళ నెందుకు వృథా చేస్తావుగాని ఇప్పటికైనా ఒప్పుకో. నువ్వూ బాగుపడిపోతావ్ ... ఆనక నేనూ! ఏమంటావ్?"

"ఛీ!" రాయుడి మాటలకు ఛీత్కారం చేస్తూ చివ్వున అరచేతుల్లోంచి తల ఎత్తింది మాలతి. "నువ్వసలు మనిషివేనా? ప్రేమపేరు చెప్పి ఇంత కాలం నాలో ఆశలు పెంచావ్. పెళ్ళివరకొచ్చేసరికి మా నాన్నకి భయపడిపోయావు. వరకట్నానికి ఆశ పడి ... నన్ను వదిలేసి మరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నావు. మళ్ళీ ఇప్పుడిలా నా వెంట పడి నన్నూ, నా కుటుంబాన్నీ సర్వనాశనం చెయ్యాలని చూస్తున్నావ్. ఎందుకు? ఎందుకని చేస్తున్నావిలా? నేను నీకేం అపకారం చేశాను?"

సిగరెట్ పీక గది మూలకు విసిరి కొడ్తూ లేచాడు రాయుడు. నవ్వుతూ మాలతి దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"అవును! నిన్ను ప్రేమించాను. నిజమే! కాని మీ నాన్న అంత డబ్బు పోసి నన్ను కొనుక్కోలేక పోయాడు. నాకు పెళ్ళయింది. అయితే ఏం? నీ మీద మోజు అలాగే ఉంది. అది తీర్చుకోవా లంటే ఇంతకన్నా మార్గం లేకపోయింది." బిగ్గ రగా నవ్వాడతను.

అసహ్యంగా అతనివైపు చూసింది మాలతి. తిరిగి ఆమెలో దుఃఖం పొర్లుకు వచ్చింది. మొహాన్ని మళ్ళీ అరచేతుల్లో దాచేసుకొంది.

"వూఁ! అయితే రేపు నీకు పెళ్ళిచూపులన్న మాట!" అదోలా అన్నాడు రాయుడు. "ఇదెప్పటి పాటేగా! ఇందులో విచిత్ర మేముంది? ఎప్పట్లాగే నిన్ను చూడ్డానికొచ్చేవాడు రేపు రాడు. అథవా వచ్చినా ... నిన్ను చేసుకోడానికొప్పుకోడు. అలా చేస్తున్నేను. వింటున్నావా?"

"ఏమండీ ... ప్లీజ్!" మాలతి చప్పున వంగి రాయుడి పాదాల్ని తాకింది. "మా మీద ఎందు కింత కసి మీకు? నేను మీ కేం ద్రోహం చేశానని? ముందుగా నన్ను ప్రేమించింది మీరే. నాలో ప్రేమను మేల్కొల్పింది మీరే. చివరకు నన్ను కాదని వేరే పెళ్ళి చేసుకొంది మీరే. ఇప్పు నా కొచ్చిన ప్రతి సంబంధాన్నీ ఎత్తగొడితే ... మా నాన్న ఇప్పటికే నా మీద బెంగతో మంచం పట్టే శారు. ఆయనలో శక్తి ఉడిగిపోయింది. ఈ సంబంధం తేవడానికి ఆయన కెంత ప్రయాసపడ్డో మీకు తెలియదు. మీ కాళ్ళకి మొక్కుతాను. నా కోసం కాకపోయినా నా కుటుంబం కోసమైనా ... ప్లీజ్ ..."

"ప్చ్ ... మాలతీ!" మధ్యలోనే అందుకున్నాడు రాయుడు. "నువ్వింతగా ప్రాధేయ పడాలా? నేను నీకు పెట్టిన షరతు మాత్రం ఏ పాటిది గనక? ఒక్కసారి ... ఒక్కసారంటే ఒక్కసారి నాకు లొంగిపో! ఆ తర్వాత హాయిగా పెళ్ళి చేసుకో. అప్పుడిక నేను అడ్డురాను ... ఏం...?"

"ఛీ...!" రోషంగా తలెత్తింది మాలతి. "ముందుగా మీకు లొంగిపోయి, ఆ తర్వాత పెళ్ళి చేసుకొని ... మరో వ్యక్తికి భార్యనై .. మైలపడిన ఈ దేహంతో కాపురం చెయ్యాలా? అనుక్షణం నన్ను నేను ఆత్మ వంచన చేసుకొంటూ ఆ వచ్చే వ్యక్తిని మోసం చెయ్యాలా ...? ఇదేనా మీరు చెప్పేది?"

"అవును." స్థిరంగా అన్నాడు రాయుడు.

"అలా ఎప్పటికీ జరుగదు. ఆ బ్రదుకు నాకు అక్కర్లేదు. మీలాంటి సంకుచితులకి లొంగిపోయి, ఆ తర్వాత వెలుగులేని బ్రతుకు బ్రతికే కన్న చావటం మేలు."

"బేషుగ్గా చావు.. నువ్ చచ్చినంత మాత్రాన నీ మీదా, నీ కుటుంబం మీదా వచ్చిన పేరు మాసి పోతుందనా...? అలా ఎంతమాత్రం కాదు. నీ తర వాత నీ పాత్ర నీ చెల్లెళ్ళు పోషిస్తారు. నీలాగే నీ చెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళు కావు. సంబంధాలన్నీ తప్పి పోతాయి. అప్పుడు ఇదే పరిస్థితి—ఆలోచించుకో..!"

రాయుడు ఈ మాటలు పలికి వెను దిరగాడు. వెళ్ళి కుర్చీలో కూలబడి, నిర్లక్ష్యంగా ఒకసిగరెట్ తీసి వెలిగించాడు.

కొద్దిసేపు ఆ గదిలో నిశ్శబ్దం అధికారం చేసింది. మాలతి గుండెల్ని చీల్చుకుంటూ ఒక సుదీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది. కళ్ళలోంచి కారుతున్న అశ్రువుల్ని తుడుచుకుంటూ, ఆమె మెల్లగా తలపైకెత్తింది.

రాయుడు ఆమెను గమనించకుండా విలాసంగా సిగరెట్ కాలుస్తున్నాడు.

"సరే! నేను వెళతాను" అంది మాలతి ఉన్నట్టుండి అలా అంటూ ఆమె గుమ్మం కేసి రెండడుగులు వేసింది.

ఆగు, మాలతీ! ఎక్కడికి వెళతావ్?"

'చావడానికి—"

'అంటే... ఆత్మహత్యా??"

'అవును..."

'ఏం...? ఎందు కంత పెద్ద శిక్ష విధించు కుంటావు? నా మాట విని, నా షరతుకి అంగీక రించు—"

'వూహూఁ!" — తల అడ్డంగా తిప్పుతూ రాయుడి కేసి అసహ్యంగా చూసింది మాలతి.

'చెప్పానుగా! అవసరమైతే. చస్తాను కాని,

నీకు మాత్రం లొంగను. కాని ఒక్కటి గుర్తుంచుకో. నా కుటుంబం ఈనాడు తప్పక నీకు లొంగుతుంది. అది మాత్రం నిజం. నిష్కారణంగా ఏ పాపమూ ఎరగని అమాయకులను కష్టాలపాలు చేసి, వాళ్ళ అంతం చూసిన నువ్వు, ఒకనాడు నీ తప్పు గ్రహిస్తావు. అప్పుడు ఆ పశ్చాత్తాప వ్యథతో సహించుకుపోలేక, మనసు పెట్టే హింసను భరించలేక నరక యాతన పొందుతావు—''

'ఎందుకంత ఆవేశం, మాలతీ! నువ్ చెప్పే వేదాంతం ఎందుకూ పనికి రానిది. నువ్ మాట్లాడే పచ్చి పుస్తకాల మాటలు నేనెన్నడూ గతాన్ని తలుచుకుని క్రుంగిపోయేవాణ్ణి కాను. మొండిగా ప్రవర్తించి ఎందుకు నిన్ను నువ్వు హింసించుకొంటావ్..?''

హా! ఏది మొండితనం..?'' విషాదంగా నవ్వింది మాలతి.

నేను ఆశపడ్డానా నన్ను నువ్వింతగా అల్లరి పెట్టావు? ఏ మనిషాలేని నన్నూ, నా కుటుంబాన్నీ నువ్వు చెక్కించావ్..? నేను నీకు లొంగలేదని కదా నా ప్రతి సంబంధాన్ని చెడగొట్టావ్? పరువు ప్రతిష్ఠలతో బ్రతుకుతున్న మా నాన్న ఈ రోజు నీ మూలంగా బయట తలెత్తుకుని తిరగ లేక, ఆ మనోవ్యాధితో మంచం పట్టాడు.

ఇదంతా ఎందుకు జరుగుతోంది...? నిన్ను ప్రతిఘటించే వాళ్ళు లేక... అవునా.... కాని ఏది ఏమైనా నా కుటుంబం ఇంకా నిక్షేపమైనా సరే, నీకు లొంగేది మాత్రం కల్ల. ఎన్ని నిందలు వేస్తున్నా... ఇంతవరకూ పవిత్రంగా ఉన్నాను. ఇప్పేప్పుడు కూడా పవిత్రంగానే చస్తాను— అంతే...''

ఉప్పెనలా పొంగుకు వచ్చే దుఃఖాన్ని ఆపుకో లేక బయటకు పరుగెత్తింది మాలతి.

• • •

రైలు వెళ్ళిపోతుంది —

మూసుకున్న కళ్ళని నిష్ఫలంగా తెరచిచూసింది మాలతి.

ఎదురుగా తన చేతిని పట్టుకొని, మొహంలోకి ఆదుర్దాగా చూస్తున్న యువకుడు కన బడ్డాడు.

ఎవరు మీరు? ఎందుకలా నన్ను చావ నీకుండా?'' కొంత విరక్తి గానూ, మరికొంత కోపం గానూ అంది మాలతి.

''చూడండీ, మాలతీ!'' మృదువైన కంఠంతో అతను చెప్పబోయాడు — మధ్యలోనే అడ్డు పడిందామె.

''అదేమిటి..? నా పేరెలా తెలుసు మీకు?''

''అవును తెలుసు! ఇందాక నేనంతా విన్నాను''

''ఏమిటి విన్నారు? అసలింతకీ ఎవరు మీరు? నన్ను చావనీకుండా ఎందుకు అడ్డు పడ్డారు?''

''చెపుతాను'' అంటూ అతను మాలతి చెయ్యి పట్టుకుని రైల్వేలైన్ దాటించి, కొంచెం పక్కగా తీసుకెళ్ళాడు.

''ఇక్కడ కూర్చోండి! అన్ని విషయాలూ చెబు తాను—'' అన్నాడు, ఆమె చెయ్యి వదిలిపెట్టి, అక్కడున్న ఒక బండరాయి మీద కూర్చుంటూ.

''నా పేరు సారధి. రాయుడు నా స్నేహితుడు''

అతను పరిచయం చేసుకుంటుంటే అయో మయంగా చూసింది మాలతి.

''అవును! రాయుడు నా స్నేహితుడు. ఈ రోజు అతనింట్లో గెస్టుగా ఉన్నాన్నేను. ఇందాక బయటి కెళ్ళి వస్తూ అనుకోకుండా మీ మధ్య జరిగిన సంభాషణ వినటం జరిగింది—''

''విన్నారా?'' కొంచెం హీన స్వరంతో అంది మాలతి.

''అవును, మాలతీ... విన్నాను ఆలా వినటమే మంచిదైంది. నిజా నిజాలేమిటో తెలిసిపోయాయి. ఇప్పుడు నేను రావటం ఒక్క నిమిషం ఆలస్యమై ఉన్నా, లేక మీ మధ్య జరిగిన సంభాషణ విన కున్నా, ఒక అమాయకురాలి నిండుప్రాణం బలై పోయుండేది—'

మాలతికి మళ్ళీ దుఃఖం ముంచుకొచ్చింది. ఆపుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ తల వంచు కొంది.

''నన్ను చావకుండా ఆపి, పొరపాటు, చేశారు. అంది.

''లేదు మాలతీ! పొరపాటు చేయలేదు. నా జీవితంలో నేను చేసిన మంచిపనీ లాభదాయకమైన పనీ ఇదొక్కటే—''

''లాభదాయకమా! ఎవరికి?''

''నాకే...!'' అన్నాడు సారధి సాభిప్రాయంగా ఆమె కేసి చూస్తూ.

ఆమె తల ఎత్తి సారధి కేసి అయోమయంగా చూసింది.

సారధి మృదువుగా నవ్వుతూ మాలతి చెయ్యి తన చేతిలోకి తీసుకొన్నాడు.

''ఏమిటిది? మీరేం మాట్లాడుతున్నారో నా కర్థం కావటం లేదు. ఇంతకీ ఎవరు మీరు? నన్నొదలండి. నేను బ్రతక్కూడదు. చావాలి!''

మాలతి చెయ్యి విడిపించుకోబోయింది. కాని సారధి వదిలి పెట్టలేదు.

''రేపు నీకు పెళ్ళిచూపులు మాలతీ! నువ్వింత దారుణానికి ఒడిగట్టడం మంచి పనా...? మీ నాన్న గంపెడంత ఆశతో ఈ పని తలపెట్టాడు అలాంటిది అసలు నువ్వే లోకంలోనే లేవని తెలిస్తే ఆయన తట్టుకోగలరా? ఆలోచించు.''

''ఇంకా ఎక్కడి పెళ్ళిచూపులు?''— జాలి గొలిపే కంఠంతో అంది మాలతి—'' మీ స్నేహి తుడి సంభాషణంతా విని కూడా నన్ను ఎగతాళి చేస్తున్నారా...?''

ఈ మాటకి సారధి అమితంగా కదిలి పోయాడు —

''లేదు, మాలతీ! ఎగతాళి చేయటం లేదు. అయినా నిజమే! నీకు ఇంకా పెళ్ళి చూపు లెందుకు? అక్కర్లేదు. అబ్బాయి అమ్మాయిని చూచ కోవటం జరిగిపోయింది. ఇష్టపడటమూ జరిగింది— మరికనేం?'' నవ్వుగా నవ్వాడు.

''ఏమిటి మీ రనేది?'' — ఉలిక్కి పడిం దామె.

''అవును, మాలతీ! రేపు నిన్ను చూసుకోడానికి రాబోయే అబ్బాయి మరెవరో కాదు — నేనే!''

''మీరా...! మీరు...'' కంగారు పడిపోయింది మాలతి. ఆమెలో ఊహించని సంచలనం కలిగింది. సరిగా నిలబడలేక పోతూంది.

రాయుడు నా స్నేహితుడని చెప్పుకోడానికే సిగ్గు పడుతున్నాను మాలతీ! అదృష్టవశాత్తు అతని నిజ స్వరూపమేమిటో తెలిసి పోయింది నాకు. నేనీ రాత్రి మూడ్ బాగుండక సినిమా చూడ కుండానే తిరిగి రావటం మేలైంది. లేకపోతే అపురూపమైన నువ్వు నాకు లభించి ఉండే దానివి కాదు.

ఈ మబ్బులు తొలగి పోయేవి కావు. ఏమైనా దేవుడు మంచివాడు మాలతీ... నేను అదృష్ట వంతుణ్ణి...!''

''ఏమండీ... మీరు... మీరు...''

మాలతికి జరుగుతున్నది అర్థం కావటం లేదు. అంతా కలలాగ ఉంది.

''మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారా? కాని... నా గురించి...'' పూర్తి చేయలేకపోయింది. ఆమె గొంతు పలకలేద ఉద్విగ్నతవల్ల.

''తప్పక చేసుకుంటాను మాలతీ! ఇక మనల్ని ఎవ్వరూ విడదీయలేరు—నామాట నమ్ము. ఇక నీ మనసులో ఎలాంటి దుఃఖపు ఛాయలు ఉండ టానికి వీల్లేదు.''

మాలతికి ఆనందమో...దుఃఖమో తెలీని ఆవేశం వచ్చింది. ఉప్పెనలాంటి ఆ ఉద్వేగానికి తట్టుకోలేక అక్కడే తెగిన పూలదండలా అతని పాదాల మీద వాలిపోయింది.

మృదువుగా ఆమె భుజాలమీద చేయివేసి లేవనెత్తా డతను.

''మరింక ఏడవద్దు మాలతీ! జీవితంలో ఇంకెప్పుడూ ఏ విషయంలోనూ నిన్ను ఏడవ నివ్వను. ఇంతకాలంగా నిన్ను ఏడ్పించుతూ తమా షాగా నవ్వుకొంటున్న వాళ్ళందరికీ.....నా అర్ధాం గిగా నిన్ను చాటి, వాళ్ళు ఏడ్చుకునేలా చేస్తాను— నీ అదృష్టానికి వాళ్ళని ఈర్ష్య పడేలా చేస్తాను.''

మాలతి బుగ్గలమీద కారుతున్న కన్నీళ్ళని, మృదువుగా తుడిచి, అనురాగంతో హృదయానికి హత్తుకున్నాడు సారధి. ■

---

## మితవ్యయం

నోరు, డబ్బు జాగ్రతగా వాడుకో వలసి ఉంది. డబ్బు మితంగా ఖర్చుచేసే సుఖం దక్కుతుంది. మాట మితంగా ఖర్చు చేస్తే పరువు నిలుస్తుంది.

— జీన్సర్‌ఎన్

## గాయాలు

కత్తితో చేసిన గాయంకన్న. మాటలతో చేసే గాయం చెడది. కత్తిగాటు శరీరాన్నే బాధిస్తుం,ది మాటగాటు ఆత్మనూ బాధి స్తుంది.

— సై త్యాగరవ్